సాక్షి ప్రకాశం

గురువారం ׀ 31 ׀ ఆగస్టు ׀ 2023



కంభం చెరువుపై కోలాహలం

తేరాతేజీ పండుగను పురస్కరించుకుని కంభం చెరువు కట్టపై కోలాహలం నెలకొంది. నూతన వధూవరులు పెళ్లినాటి దండలు వదిలి మొక్కులు చెల్లించుకున్నారు.

- 8లో..



పోలీసుల అదుపులో నిందితుడు

పెద్దదోర్నాల మండలం కడపరాజుపల్లెలో బాలుడిపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు ముండ్లా శ్రీనును పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ వివరాలు వెల్లడించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం

36/29

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఎంపీ మాగుంట రాక



ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గురువారం నుంచి శనివారం వరకు ప్రజలకు అందుబాటులో ఉంటారని మాగుంట కార్యాలయ మేనేజర్ భవనం సుబ్బారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మాగుంట రాఘవరెడ్డితో కలిసి వల్లూరమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు కొత్తపట్నం మండలం అల్లూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కేంద్రియ విద్యాలయంలో కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు టంగుటూరు మండలం తేటుపురంలో మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభిస్తారు. సెప్టెంబర్ 2వతేదీ స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు జేఎంబీ చర్చి వద్ద వైఎస్సార్ విగ్రహానికి పుష్పమాలంకరణలో పాల్గొంటారు. 11.30 గంటలకు దొనకొండ, యర్రగొండపాలెంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

తైక్వాండో జాతీయ స్థాయి పోటీలకు చరిష్మా

- రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించిన చరిష్మా



పోటీలకు ఎంపికైన చరిష్మా

తాళ్లూరు (ముండ్లమూరు): తూర్పుగోదావరి జిల్లాలో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో తాళ్లూరు మండలం నాగంబొట్ల పాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోము అనిల్‌రెడ్డి, వెంకట సుబ్బులు పెద్ద కుమార్తె చరిష్మా పాల్గొని మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. దీంతో వచ్చే నెల 9 నుంచి 11వ తేదీ వరకు అసోంలోని గౌహతిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికైంది. చరిష్మా ప్రస్తుతం బీటెక్ ద్వితీయ సంవత్సరం తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో చదువుతోంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించిన చరిష్మాకు ఎంపీపీ తాడికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు యిడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు పులి ప్రసాదరెడ్డి, శనివారపు శ్రీనివాస రెడ్డి అభినందనలు తెలిపారు.

3న జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు వచ్చే నెల 3వ తేదీన సింగరాయకొండలోని ఏఆర్సీ, జీవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతాయని పీడీలు కె.జీవన్ కుమార్, జి.మురళి తెలిపారు. 14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల, బాలికలు, 23 సంవత్సరాల లోపు పురుషులు, స్త్రీలకు ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులు ఎంపికలకు వచ్చేటప్పుడు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో హాజరు కావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అన్ని మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొనాలని కోరారు. 9848579604, 8919036160, 8978482329 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారితో స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు

ఒంగోలు: జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల ఎంపిక బుధవారం స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, చెస్, క్యారమ్స్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో మొదలైన ఆటల పోటీల్లో ఈ ఎంపిక జరిగింది. స్టెప్ సీఈవో ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా చీఫ్ కోచ్ రాజరాజేశ్వరిలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మొత్తం 50 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరు సెప్టెంబర్ 8 నుంచి 11వతేదీ వరకు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ ఎంపిక ప్రక్రియను బాక్సింగ్ కోచ్ వేణు, సెపక్‌తక్రా కోచ్ శ్రీనివాసులు, క్రికెట్ కోచ్ ఆనంద్, మణికంఠ, షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ షేక్ చాంద్ అల్లీష నిర్వహించారు.



అరుదైన కొమ్ము కోణం చేప

మీనం.. బంగారం..

ఒంగోలు డెస్క్



కోటి ఆశలతో సముద్రంలో వేటకు బయలుదేరుతున్న మత్స్యకారులు

విశాల ప్రకాశ తీరం.. అరుదైన మత్స్య సంపదకు ఆలవాలం. సముద్ర ఉపరితలం నుంచి గర్భం వరకు మదించితే.. ఎన్నో రకాల మత్స్య సంపద మత్స్యకారుల వలకు చిక్కుతున్నాయి. ఒక్కొక్క మత్స్య జాతి అనేకానేక సుగుణాలు కలిగి ఉంటుంది. మనం కూరగా తినే చేపల నుంచి మందుల తయారీ, పశుపక్ష్యాదుల దాణా వరకు వినియోగించే అరుదైన మత్స్య జాతులు మన సొంతం. ఇక్కడ దొరికే మత్స్య సంపద దేశ విదేశాలకు విరివిగా ఎగుమతి అవుతోంది. దేశంలోనే ఎగుమతుల్లో ఉమ్మడి జిల్లా తొలి స్థానంలో నిలుస్తోంది. అసలు తీరంలో ఎలాంటి చేపలు పడతాయి..మత్స్యకారుల ఆదాయం ఎంత.. ఎన్నో ఆసక్తి కలిగించే వివరాలు తెలుసుకుందామా మరి..

- అరుదైన జలచరాల ఆవాసం ఉమ్మడి జిల్లా తీరం
- షార్క్‌ల నుంచి టేకు చేపల వరకు..
- ఔషధాల్లో వినియోగించే కచ్చల చేపలు లభ్యం
- తరచూ గంగపుత్రుల వలలకు చిక్కుతున్న వైనం
- ఇతర రాష్ట్రాలకు మత్స్య సంపద ఎగుమతుల్లో ఉమ్మడి ప్రకాశం ఫస్ట్
- ఏటా రూ.200 కోట్ల మేర ఎగుమతులు
- ప్రత్యేక వాహనాల్లో దేశంలోని ప్రధాన నగరాలకు తరలింపు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో

తీర ప్రాంతం	102 కి.మీ
మత్స్యకార గ్రామాలు	74
మత్స్యకారులు	80,000
ఇంజన్ బోట్లు	1,849
సంప్రదాయ బోట్లు	2,883
మత్స్యకార సొసైటీలు	54

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సింగరాయకొండ, పాకల తీరం నుంచి చీరాల వాడరేవు వరకు తీర ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతం అపారమైన మత్స్య సంపదకు నిలయం. ఈ ప్రాంతంలో తరుచూ జాలర్ల వలకు అరుదైన మత్స్య సంపద చిక్కుతోంది. తరచుగా పులి మచ్చల షార్క్ (సొర చేప) ఏనుగు టేకు చేపలు, కొమ్ము కోణం, వింత ఆకృతి చేపలు, ఔషధాల్లో వినియోగించే కచ్చల, టూనా చేపలు లభిస్తున్నాయి. తీరం నుంచి 150 కిలో మీటర్ల మేరకు వేట చేసేందుకు వెళ్లగా చేపలు, టైగర్ రొయ్యలు, టూనా చేపలు అధికంగా పడే కొండ ప్రాంతాల్లో ఈ షార్క్‌లు, టేకు, కచ్చల చేపలు వలలకు చిక్కుతున్నాయి. వీటిలో అధికంగా కచ్చల చేపల నుంచి తీసే ఆయిల్ (నూనె) ఔషధాల్లో వినియోగిస్తారు.

వివిధ రాష్ట్రాలకు మన మత్స్యం ఎగుమతి

జిల్లాలోని తీరప్రాంతాల్లో ప్రధానంగా వాడరేవు, కొత్తపట్నం, రామాయపట్నం, కరేడుతో పాటు పలు ప్రాంతాల్లో వచ్చే మత్స్య సంపదలో 75 శాతం వివిధ రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.200 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. అందులో చీరాల తీరం నుంచి రూ.100 కోట్లకు పైగా ఎగుమతవుతున్నాయి. ముఖ్యంగా తీరానికి వచ్చిన చేపలను ఐస్‌తో ప్రత్యేక బాక్సుల్లో ప్యాకింగ్ చేసి చెన్నై, బెంగళూరు, గోవా, ముంబయి, హౌరా తదితర మహా నగరాలకు ఎగుమతి చేస్తారు. ఎక్కువగా రైళ్లు, ఇతర ప్రత్యేక ఏసీ వాహనాలు, లారీల్లో తరలిస్తున్నారు. అక్కడి నుంచి సముద్ర మార్గాన ఇతర దేశాలకు వెళ్తున్నాయి. సముద్రాలు ఉన్న నగరాల్లో సైతం మత్స్య సంపద అరకొరగానే లభిస్తుండడంతో ఇక్కడి వాటికి మంచి గిరాకీ ఉంది.

జిల్లాలో దొరికే చేపలు

జిల్లాలోని తీర ప్రాంతాల్లో అధికంగా దొరికేవి వంజరం, కొమ్ము కోణం, కచ్చల, చందువా, గురకా, యంగళి, టూనా, గనసా, పారలు, పండుగప్ప, పాము వంటి చేపలు విరివిగా దొరుకుతాయి. వీటితో పాటుగా సముద్రపు రొయ్యలు టన్నుల సంఖ్యలో లభ్యమవుతున్నాయి.

ఆరు నెలలకోకసారి..

వాడరేవు మత్స్యకారుల వలలకు ఆరు నెలలకు ఒకసారి ఏదో ఒక అరుదైన చేపలు, షార్క్‌లు, టేకు చేపలు లభిస్తూనే ఉంటాయి. షార్క్‌లు ఆగస్టు నుంచి నవంబర్ వరకు అరుదుగా బయటకు వస్తుంటాయి. షార్క్‌లు ఉన్న ప్రదేశాల్లో మత్స్య సంపద ఎక్కువగా ఉంటుందనేది జాలర్ల నమ్మకం. ఆ వైపుగా వేట చేస్తారు. ఒక్కోసారి షార్క్‌లే చిక్కుతాయి.

ఔషధాల కచ్చల



ఔషధాల్లో వినియోగించే అత్యంత ప్రియమైన, అరుదుగా లభించే కచ్చల చేప వలకు చిక్కుతోంది. ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి కాపాడేందుకు ఔషధాల్లో దీనిని వినియోగిస్తారు. దీనిలోని కొవ్వు, మాంసం, ఇతర పదార్థాలను ఔషధాల్లో వాడుతారు. ఈ చేపను చెన్నై ఔషధ ఫ్యాక్టరీకి పంపిస్తామని చేపల వ్యాపారి తెలిపారు. భారీ బరువున్న దీనికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వాడరేవుకు చెందిన మత్స్యకారుడు దోని దేవుడు వేటకు వెళ్లగా 28 కిలోల బరువు కలిగిన కచ్చల చేప వలకు చిక్కింది. దీనిని వేలం వేయగా రూ.1.70 లక్షలు పలికింది.

150 కి.మీ. అవతల అరుదైన చేపలు



చిన్నతనం నుంచి వేట తప్ప మరో పని తెలియదు. మత్స్యకారుడిగా వాడరేవు తీరం నుంచి నెల్లూరు జిల్లా తడ, కాకినాడ వరకు వేట చేస్తుంటాం. చీరాల వాడరేవు తీరం నుంచి 150 కిలో మీటర్ల దూరం వెళితే చేపల గుంపులతో పాటు, టైగర్ రొయ్యలు కూడా దొరుకుతాయి. సముద్రంలో చేపల గుంపులు కనిపించగా కొన్ని పెద్దచేపలు కూడా వస్తుంటాయి. మేము మూడు కిలో మీటర్ల వరకు వల విసిరితే సమీపంలో ఉండే ఏవైనా పెద్ద చేపలు, అరుదైన చేపలు వలకు చిక్కుతుంటాయి. వాడరేవు తీరం ప్రత్యేకమైంది. మత్స్య సంపద అధికంగానే చిక్కుతుంది.

– వై.కొండబాబు, మత్స్యకారుడు, వాడరేవు

ఈ సీజన్‌లో ఇప్పుడే మత్స్య సంపద లభ్యం



విరామ సమయం అనంతరం ఇప్పటి వరకు మత్స్య సంపద పెద్దగా ఆశించినట్లు పడలేదు. ఈ సీజన్‌లో కూనలు, బంక సీదలు, తెల్ల సీదలు, కానాకంతలు వంటి చేపలు లభిస్తాయి. వారం రోజుల నుంచి ఇప్పుడిప్పుడే మత్స్య సంపద వలలకు పడుతోంది. దూరప్రాంతాలకు వెళ్లి వేటాడుతున్నారు.

– పీత కోటేశ్వరరావు, కొత్తపట్నం కె.పల్లెపాలెం

అరుదైన టైగర్ షార్క్



సముద్రంలో వేట చేస్తున్న మత్స్యకారుల బృందానికి భారీ టైగర్ షార్క్ చేప చిక్కింది. తీరానికి 70 కిలో మీటర్ల అవతల వలలను విసరగా 800 కిలోల బరువు కలిగిన టైగర్ షార్క్ వలకు చిక్కింది. తమ వలకు భారీగా మత్స్య సంపద చిక్కిందని భావించిన మత్స్యకారులకు క్షణాల్లోనే అది షార్క్ చేప అని తేలడంతో దానిని వల నుంచి విడిపించడానికి అష్టకష్టాలు పడ్డారు. ఈ భారీ టైగర్ షార్క్ చేపను కష్టపడి తీరానికి చేర్చి వల నుంచి విడిపించి సముద్రంలో విడిచిపెట్టారు. అరుదుగా కనిపించే టైగర్ షార్క్ చేప బతికే ఉండటంతో రెండు గంటల పాటు కష్టపడి తిరిగి సముద్రంలో వదిలేందుకు మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు.

భారీ ఏనుగు టేకు చేప



వాడరేవుకు చెందిన ఐదుగురు కళాసీలు కలిసి సముద్రంలో వేటకు వెళ్లారు. భారీగా మత్స్య సంపద చిక్కిందని ఆనంద పడ్డారు. కష్టపడి వలను బయటకు లాగి చూస్తే 9 అడుగుల పొడవు, 10 అడుగుల వెడల్పుతో 4 క్వింటాళ్లకుపైగా బరువు ఉన్న ఏనుగు టేకు చేప పడింది. ఐదు రోజులుగా వేట చేస్తున్న తమకు టేకు చేప వలకు చిక్కగా సోమవారం తీరం ఒడ్డున వేలం పాట నిర్వహించగా కేవలం రూ.2 వేలు పలికింది.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



సముద్రంలో వేటాడిన సరుకంతా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. వచ్చిన చేపలను ఒక చోట చేర్చి పాట రూపంలో విక్రయిస్తాం. ఎక్కువ ధర ఇచ్చిన వారికే ఇస్తాం. అరుదైన చేపలు ఏడాదిలో సెప్టెంబర్, నవంబర్ నెలలో పడతాయి. ఇవి ఎక్కువగా కేరళ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలకు ఎగుమతి చేస్తారు.

– పి.అంజియ్య, కొత్తపట్నం, కె.పల్లెపాలెం

అంగన్‌వాడీల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, అంగన్‌వాడీ సమస్యలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులు బుధవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల జీతాలను వేయి రూపాయల వరకు పెంచాలని, ఉద్యోగం చేస్తూ మరణించిన కార్యకర్త కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని, ఏడేళ్లుగా నిలిచిపోయిన టీఏలను వెంటనే మంజూరు చేయాలని, అర్హతలు కలిగిన ఆయాలకు రాజకీయ జోక్యం లేకుండా పదోన్నతి కల్పించాలని వినతి పత్రంలో కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. అంగన్‌వాడీల సమస్యలపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, కోశాధికారి కేవీ సుబ్బమ్మ, జిల్లా నాయకులు జయశ్రీ, జ్యోతి, నాగలక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పది ఫెయిలైన అభ్యర్థులు పరీక్ష ఫీజు చెల్లించాలి

ఒంగోలు: పదో తరగతి పరీక్షల్లో ఫెయిలై 2024 మార్చిలో పరీక్షలకు హాజరుకాదలుచుకున్న విద్యార్థులు సెప్టెంబర్ 15వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 20 వరకు, రూ.200ల అపరాధ రుసుంతో సెప్టెంబర్ 25 వరకు, రూ.500 అపరాధ రుసుంతో సెప్టెంబర్ నెలాఖరు వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించారన్నారు. ఒక సబ్జెక్టుకు రూ.80, రెండు సబ్జక్టులకు రూ.110, మూడు సబ్జక్టులకు రూ.110, మూడు అంతకన్నా ఎక్కువ సబ్జక్టులకు రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలు తాము పదో తరగతి అభ్యసించిన పాఠశాల హెడ్మాస్టర్‌ను సంప్రదించాలన్నారు.

టీటీడీ పాలకవర్గ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించిన శిద్దా సుధీర్



శ్రీవారి దర్శనం అనంతరం బయటకు వస్తున్న శిద్దా రాఘవరావు, సుధీర్

ఒంగోలు: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యునిగా శిద్దా వీర వెంకట సుధీర్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిరుమలలో శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శిద్దా సుధీర్‌కుమార్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా వచ్చిన సుధీర్ కుమార్‌కు మహాద్వారం వద్ద టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శిద్దా కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వకుళమాత, విమాన వెంకటేశ్వరస్వామి, సబేరా, శ్రీభాష్యకార్ల సన్నిధి, శ్రీయోగ నరశింహస్వామి వారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం చేశారు. టీటీడీ ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరాన్ని దర్శించి గోపూజలో పాల్గొని పాదాల మండపంలో శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమలలో శ్రీవరాహ స్వామిని కూడా దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తనకు శ్రీవారి సేవలో తరించే భాగ్యం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ధర్మపరిరక్షణ కోసం పనిచేస్తానని, ఆలయం పవిత్రతను కాపాడుతూ, సలహాలు, సూచనలు తీసుకుంటూ శ్రీవారి సేవలో పాల్గొంటూ భక్తులకు సేవలు అందించేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిమ్‌ను కేవైసీ చేయించుకోవాలి

ఒంగోలు టౌన్: బీఎస్ఎన్ఎల్ సిమ్ కార్డును పేపర్ అప్లికేషన్ ద్వారా పొందిన వినియోగదారులు వెంటనే కేవైసీ డిజటలైజ్ చేయించుకోవాలని బీఎస్ఎన్ఎల్ జిల్లా జనరల్ మేనేజర్ స.సుధీర్ తెలిపారు. సమీపంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ సేవా కేంద్రం, ఫ్రాంచైజీ, రిటైలర్‌లను సంప్రదించి సెప్టెంబరు 30వ తేదీలోపు కేవైసీ చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల వినాయోగదారులు మరింత ఆధునిక సాంకేతిక భద్రత లభిస్తుందన్నారు. త్వరలోనే దేశ వ్యాప్తంగా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొస్తుందని చెప్పారు. అందుకోసం 3జీ సిమ్ కార్డును వినియోగిస్తున్న వారి కోసం ఉచితంగా సిమ్ అప్‌డేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. తమ మొబైల్ ఫోన్లో ఉన్న సిమ్ కార్డు వివరాలను తెలుసుకునేందుకు తమ మొబైల్ ఫోన్ నుంచి సిమ్ అని టైప్ చేసి 9441299999కు మెసేజ్ పంపించి తెలుసుకోవచ్చని తెలిపారు.

ప్రజల నాయకుడు గద్దర్

- ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



సభలో మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాద్

సింగరాయకొండ: ప్రజా గాయకుడుగా తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకుని సమాజంలో తనదైన ముద్ర వేసుకున్న విప్లవ గాయకుడు గద్దర్ ప్రజల నాయకుడని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ కొనియాడారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బుధవారం రాత్రి గద్దర్, జహీరుద్దీన్ ఆలీఖాన్ సాంస్కృతిక సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గద్దర్‌తో ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని ఆయనతో గడిపిన స్మృతులను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా గద్దర్, ఆలీఖాన్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు


మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, ఆ దిశగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. ప్రకాశంభవనంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల తొలగింపుపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని తొలగించాలన్నారు. ఇంటింటి సర్వే పరిశీలన చేయాలన్నారు. అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా కృషి చేయాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ రామిశెట్టి శ్రీలత, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషా బేగ్, బసినేపల్లి రాజశేఖర్, గుర్రం సత్యం, రసూల్, బాలకోటయ్య, ఉపేంద్ర, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వీడనున్న రాష్ట్రానికి పట్టిన 'పచ్చ' ఖర్మ

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: రాష్ట్రానికి పట్టిన టీడీపీ ఖర్మ త్వరలో వీడనుందని, అధికారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆ పార్టీ నాయకులు ఊరు, వాడలు తిరుగుతున్నారని, వీరిని రాష్ట్రం నుంచి తరిమివేసే సమయం ఆసన్నమైందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం-4 పరిధిలోని తిరుమలగిరి కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పరంగా లబ్ధిదారులకు చేకూరిన లబ్ధి గురించి వివరించడంతో పాటు ఇంకా ఏమైన సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మెరుగైన పాలన అందించేందుకు సీఎం జగనన్న గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రభుత్వ పాలనను తమ ముంగిటకు తీసుకొచ్చారన్నారు. టీడీపీ ప్రభుత్వ కాలంలో రేషన్ కార్డు కావాలన్నా, పింఛన్ మంజూరు చేయించుకోవాలన్నా లబ్ధిదారులు నరకం అనుభవించేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన విధానాన్ని చక్కగా గాడిలో పెట్టారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాల్లో తప్పులు ఎత్తిచూపే అవకాశం లేక ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు దిక్కుతోచని స్థితిలో ఉన్నాడని, ఆయన ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో, ఏం చేస్తున్నారో, ఏం చేయమంటారో అర్థంగాక టీడీపీ కార్యకర్తలు సైతం నెత్తిబాదుకుంటున్నారని మంత్రి వ్యంగ్యంగా అన్నారు. 2019లో చంద్రబాబును అమరావతి నుంచి తెలంగాణకు తరిమారని, 2024లో జరిగే ఎన్నికల్లో ఆయనకు పూర్తిస్థాయిలో వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో మహిళా సాధికారత సాధించేందుకు జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్నారని, సొంతింటి కల నెరవేర్చేందుకు జగనన్న సంపూర్ణ గృహహక్కు పథకం కింద అర్హులైన వారందరికి ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారని, అందుకు కూడా టీడీపీ నాయకులు అడ్డుపడటం శోచనీయమన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ రాష్ట్రంపై విరుచుకుపడుతూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వీరి మాటలను ప్రజలు గమనిస్తున్నారని, వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాటీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు రాచగొర్ల పిచ్చయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, నాయకులు సూరె రమేష్, ఎం.సుబ్బారావు, వై.వెంకటేశ్వరరెడ్డి, డీఎల్‌డీవో బీవీఎస్ సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వైవీ నాగేశ్వరప్రసాద్, పీఆర్ డీఈ ఎం.సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఎంఈవో పి.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కంభం చెరువుపై కోలాహలం


చెరువుకట్టపై కూర్చొని భోజనాలు చేస్తున్న ప్రజలు


దీనాషా వళి దర్గా వద్ద ప్రార్థనలు

- తేరాతేజీ వేడుకలకు తరలివచ్చిన ప్రజలు
- పెళ్లి నాటి మొక్కులు తీర్చుకున్న నూతన వధూవరులు
- దీనాషావళి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

కంభం : తేరాతేజీ (గరికతొక్కుడు) పండుగను పురస్కరించుకొని బుధవారం కంభం చెరువుకట్టపై కోలాహలం నెలకొంది. చుట్టుపక్కల గ్రామాల నుండే కాక ఇతర జిల్లాల నుంచి ప్రజలు కుటుంబ సమేతంగా కంభం చెరువుకు చేరుకున్నారు. నూతన వధూవరులు కంభం చెరువులో పెళ్లి నాటి దండలు వదిలి తమ మొక్కులు తీర్చుకొని సరదాగా గడిపారు. ఇంటి వద్ద తయారు చేసుకున్న వంటకాలు పిల్లాపాపలతో కలసి కట్టపై కూర్చొని తిన్నారు. చెరువుకట్ట మార్గం వెంట ఉన్న పంటపొలాల్లో సైతం పలువురు కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. కట్టపై ఉన్న దీనాషా వళి దర్గా వద్ద కొబ్బరికాయలు, బూందీతో ప్రజలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కంభం చెరువులో నీళ్లు ఉండటంతో ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భారీగా వాహనాలు రావడంతో సాయంత్రం ట్రాఫిక్‌కు కొంత సేపు అంతరాయం కలిగింది. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో కట్టపై కూలింగ్ వాటర్ సౌకర్యం కల్పించి, బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసారు.


కంభం చెరువులో దండలు వదిలి మొక్కులు తీర్చుకుంటున్న కొత్తజంటలు


కంభం చెరువుపై కోలాహలం


తేరాతేజీ సందర్భంగా వాహనాలు, ప్రజలతో కళకళలాడుతున్న కంభం చెరువు

కొండపిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి


విజయసాయిరెడ్డితో జంకె, రూప్‌కుమార్, వరికూటి, మాదాసి, అశోక్‌రెడ్డి తదితరులు

టంగుటూరు: వచ్చే ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని రాజ్యసభ సభ్యుడు, ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో కొండపి నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుకెళ్లాలని సూచించారు. ఆయన నిర్ణయం మేరకు అందరూ నియోజకవర్గంలో పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం పాకల గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో ఓటమిపై ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు రూప్‌కుమార్ యాదవ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ మాదాసి వెంకయ్య, వైద్యవిభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ నేతలు, పాకల గ్రామస్తులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి


మాట్లాడుతున్న పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్

ఒంగోలు: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ సూచించారు. స్థానిక రామచంద్ర మిషన్‌లో పల్నాడు, ప్రకాశం, బాపట్ల, నెల్లూరు జిల్లాల ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్మాస్టర్లకు బుధవారం జరిగిన నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయునిలో నాయకత్వ లక్షణాలు ఉంటే పాఠశాల క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. కుటుంబ పెద్ద మాదిరిగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. పాఠశాల విధి నిర్వహణలో ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. జిల్లా విద్యాశాఖాధికారి వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ మొత్తం నాలుగు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరించేందుకు ఉత్సుకత చూపాలన్నారు. కోర్సు డైరెక్టర్‌గా ఒంగోలు ఎంఈఓ తిరుపతి కిషోర్‌బాబు, సమగ్రశిక్ష ఎఎంఓ రమేష్, స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో లైంగికదాడి నిందితుడు

- విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాల వెల్లడి
- గంటల్లోనే అదుపులోకి తీసుకోవడంపై ఎస్సైకి అభినందన

పెద్దదోర్నాల: మండలంలోని కడపరాజుపల్లెలో బాలునిపై లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడు ముండ్లా శ్రీనును అదుపులోకి తీసుకున్నట్లు మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. గ్రామంలోని ఓ పెళ్లికి హాజరైన ముండ్లా శ్రీను తనతో పాటు బాలుడిని మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని గ్రామ పొలిమేరల్లోకి తీసుకెళ్లి ప్రకృతికి విరుద్ధంగా బాలునిపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఈ క్రమంలో గాయపడిన బాలుడు ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని తెలపటంతో కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, బుధవారం మధ్యాహ్నం వలపన్ని నిందితున్ని అదుపులోనికి తీసుకున్నట్లు తెలిపారు. సంఘటన జరిగిన కొద్ది గంటల్లోనే అదుపులోనికి తీసుకున్న ఎస్సై అంకమ్మరావును అభినందించారు. చెడు వ్యసనాలకు బానిసలైన కొందరు యువకులు తప్పిదారి పడుతున్నారని తెలిపారు. మండలానికి చెందిన కొందరు యువకులు సైబర్ నేరాలకు పాల్పడుతున్న విధానాలపై విచారం వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదువుకున్న యువత మంచి మార్గంలో ప్రయాణించాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తప్పు చేసిన వాడు ఎవరైనా, ఎప్పడికైనా శిక్షకు గురికావాల్సిందేనన్నారు. ద్ది రోజుల క్రితం యర్రగొండపాలెంలో అనుమానాస్పదంగా చనిపోయిన గుర్తుతెలియని చిన్నారి మృతదేహం ఎవరన్నది ఇంకా గుర్తించలేదన్నారు. మండలంలోని 3 నుంచి ఐదేళ్ల వయసులో పిల్లలు కనపడకుండా ఉండి ఉంటే యర్రగొండపాలెం ఎస్సై, సీఐలకు సమాచారం ఇవ్వాలని కోరారు. విలేకరుల సమావేశంలో యర్రగొండపాలెం సీఐ.మారుతీకృష్ణ, ఎస్సై అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

'నా కోసం ఎవరూ వెతకొద్దు'

- బ్యాంక్ ఉద్యోగి అదృశ్యం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండల కేంద్రంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అంబటి మధు (32) కనిపించడం లేదని ఆయన భార్య నాగమణి మర్రిపాడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పామూరు సమీపంలోని కంబాలదిన్నె గ్రామానికి చెందిన మధుకు వింజమూరు మండలం చాకలికొండకు చెందిన నాగమణితో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైంది. గతంలో అద్దంకి ఏపీజీబీ శాఖలో పనిచేస్తూ మూడునెలల క్రితం మర్రిపాడుకు బదిలీపై వచ్చాడు. భార్యాబిడ్డలతో కలిసి మర్రిపాడులోనే నివాసముంటూ విధులు నిర్వహిస్తున్నాడు. అయితే తరచూ తన భార్యతో జీవితమంటే ఇంతేనా అంటూ మాట్లాడుతూ ఉండేవాడు. అలాగే పర్సనల్ డైరీలో తన కోసం వెతకొద్దని, చనిపోవడానికి వెళ్లడం లేదని రాసి పెట్టాడని పోలీసులు తెలిపారు. డైరీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి వెల్లడించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


యువకుడు రాజకుమార్ మృతదేహం

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం భూపతి పల్లె ఎస్సీ కాలనీ చెందిన వేశపోగు రాజకుమార్ విద్యుత్ షాక్ తో బుధవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మార్కాపురం పట్టణంలో వేశపోగు రాజకుమార్ పెయింట్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చి స్నానం చేసి టవల్ బయట ఆరేస్తుండగా ట్రాన్స్‌ఫారం వద్ద ఉన్న విద్యుత్ తీగ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. బొడిచర్ల సర్పంచ్ మున్నంగి కోటేశ్వరి ఇంటి ముందున్న ట్రాన్స్‌ఫారం మార్చాలని రెండేళ్లుగా వేడుకున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని ఆమె వాపోయారు.

ఆ రోజు రాత్రి ఏం జరిగింది..?

- హారం తీసుకెళ్లింది దొంగేనా
- ఆర్టీసీ బస్టాండులో బంగారు నగలు ఉన్న బ్యాగ్

ఒంగోలు టౌన్: ఆర్టీసీ బస్టాండ్లో గరుడ బస్సులోంచి పోయిన బ్యాగు గురించి పలు సందేహాలు రేకెత్తుతున్నాయి. అసలు సోమవారం రాత్రి ఒంగోలు బస్టాండ్‌లో ఏం జరిగింది. గరుడ బస్సు డిక్కీలో పెట్టిన బ్యాగు ఎలా బయటకు వచ్చింది అనేది సస్పెన్స్‌గా మారింది. వివరాల్లోకి వెళితే..సోమవారం రాత్రి ఒంగోలు నగరానికి చెందిన దంపతులు హైదరాబాద్ వెళ్లేందుకు బస్టాండ్‌కి వచ్చి సీట్లో కూర్చున్నారు. వారి బ్యాగ్‌ను బస్సు వెనక ఉండే డిక్కీలో ఉంచారు. బస్సు బయలుదేరడానికి ఇంకా సమయం ఉండడంతో బస్సు క్లీనర్ డిక్కీకి తాళం వేయకుండా బయటకు వెళ్లాడు. ఈ లోగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి డిక్కీ తలుపు తెరిచి బ్యాగును తీసుకెళ్లారు. టీ తాగి వచ్చిన క్లీనర్ మరో ప్రయాణికుడి లగేజీని డిక్కీలో పెట్టేందుకు వెళ్లినప్పుడు ఈ బ్యాగు కనిపించకపోవడంతో సదరు ప్రయాణికులను అడగడంతో బ్యాగుపోయిన సంగతి బయట పడింది. బ్యాగులో రూ.3 లక్షల విలువైన బంగారు నగలు ఉన్నాయి. దీంతో వెంటనే ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడం, వారు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ పోలీసులు బస్సును తనిఖీ చేసినా కనిపించలేదు. దీంతో సీసీ కెమెరాలు పరిశీలించారు. అయితే బస్టాండ్లో 7వ ప్లాట్‌ఫారం నుంచి 19వ ప్లాట్‌ఫారం వరకు కొన్ని నెలలుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. బ్యాగ్ కోసం వెతుకుతున్న పోలీసులకు తెల్లవారుజామున 5 గంటల ప్రాంతంలో 19వ నెంబరు ప్లాట్‌ఫారం దగ్గర బ్యాగు కనిపించింది. బ్యాగులో బంగారు నగలు అలాగే ఉన్నాయి. మిగిలిన సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు ఓ వ్యక్తి బ్యాగ్‌ను తీసుకెళ్లడం కనిపించింది. అయితే అతడు ఎవరు..? బస్సు డిక్కీలో ఉన్న బ్యాగును ఎందుకు తీసుకెళ్లాడో అర్థం కాకుండా ఉంది. రాత్రి 11 గంటల సమయంలో పోయిన బ్యాగు తెల్లవారుజాము 5 గంటల వరకు భద్రంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

నిర్లక్ష్యమే కారణమా..?


ఇటీవల ఆర్టీసీ బస్టాండ్లో తరుచూ దొంగతనాలు జరుగుతున్నా యాజమాన్యం తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. డిపోలో విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదు. ఇటీవల తిరుపతికి వెళుతున్న ప్రయాణికురాలి మెడలోని బంగారు నల్లపూసల దండను ఒక దొంగ లాక్కొని పరారైన ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి దొంగతనాలు తరుచూ బస్టాండ్లో జరుగుతూనే ఉన్నాయి. బస్టాండ్‌లో కొందరు వ్యక్తులు, మహిళలు హిజ్రాల్లా నటిస్తూ దొంగతనాలకు పాల్పడున్నట్లు తెలుస్తోంది. బస్టాండ్ పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


కోటయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

త్రిపురాంతకం: మండల పరిధిలోని జాతీయ రహదారిపై సోమేపల్లి అడ్డరోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. త్రిపురాంతకం నుంచి వెల్లంపల్లి వెళుతున్న అదే గ్రామానికి చెందిన తూమాటి కోటయ్య (35) బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురవడంతో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కోటయ్య మృతితో కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి. ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి


ఉండవల్లి బాబూరావు(ఫైల్)

మద్దిపాడు: కారు ఢీకొన్న ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం ఉదయం వెల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గుండ్లాపల్లి గ్రామానికి చెందిన ఉండవల్లి బాబూరావు(74) వెల్లంపల్లి బ్రిడ్జి సమీపంలో ఉన్న పైపుల కంపెనీలో పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే పైపుల కంపెనీలో విధులకు వెళుతుండగా అద్దంకి నుంచి ఒంగోలు వెళుతున్న కారు ఢీకొనడంతో తలపై కాళ్లకు తీవ్రమైన గాయాలయ్యాయి. కారు నడుపుతున్న డ్రైవరే ఆతనిని కారులో వేసుకుని మద్దిపాడు పీహెచ్‌సీకి రాగా వారు వెంటనే ప్రథమ చికిత్స చేసి రిమ్స్‌కు 108 ద్వారా తరలించారు. అక్కడ చికిత్స చేయడానికి ఎక్స్‌రే తీయించి స్కానింగ్‌కు తీసుకువెళుతుండగా మృతి చెందాడు. సమాచారం అందుకున్న మద్దిపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కారును సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మృతునికి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌లో మృతదేహాన్ని ఉంచారు. మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎం గోదాములు పరిశీలన

ఒంగోలు అర్బన్: నెలవారి తనిఖీల్లో భాగంగా స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోదాములను ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. గోదాము షెట్టర్లకు వేసిన తాళం సీళ్లను పరిశీలించి భద్రత ఏర్పాట్లపై ఆరా తీశారు. గోదాము వద్ద పక్కా భద్రతా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీ ప్రతినిధులు గుర్రం సత్యం, రసూల్, ఎన్నికల విభాగం అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య కేసులో ఇద్దరు అరెస్టు

కొమరోలు: వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై సుబ్బరాజు తెలిపారు. మండలంలోని బెడుసుపల్లెలో శశికళ (32) ఈనెల 24వ తేదిన ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందింది. శశికళ తండ్రి రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎస్సై దర్యాప్తు చేపట్టారు. శశికళ భర్త గుర్రప్పడు, అత్త బసవమ్మలు శశికళపై అనుమానంతో వేధిస్తుండగా శశికళ వేధింపులు భరించలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫిర్యాదులో తండ్రి రమణయ్య పేర్కొన్నారు. ఇరువురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లుగా ఎస్సై తెలిపారు.